# హైటెక్ స్పీడ్

**- టీ. ఆర్. ఇంద్ర**

కులీకుతుబ్‌షా మధురస్వప్నాలకు సజీవరూపం భాగ్యనగరం హైదరాబాద్. 24 గంటలూ బిజీగా వుండే కూడలి హైదరాబాద్‌లో ఒక్కటే. ఎక్కడన్నా జన సంచారం ఉండదేమోగానీ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో మాత్రం ఎప్పుడూ రద్దీనే. ఎప్పటిలానే ఈ రోజు సూర్యుడు మిట్టమధ్యాహ్నం 12 గంటలయ్యింది కాబోలు మండిపడుతున్నాడు.

ఎవరికివారే యమునా తీరే సామెతలా ఎవరి రాచకార్యాల్లో వాళ్లు బిజీగా ఉన్నారు. ధ్వని కాలుష్యం, శబ్దకాలుష్యం పోటీ ఓవైపు, మరోవైపు నడినెత్తిన ఎండ మండిపోతోంది. రెడ్ లైట్‌పోయి గ్రీన్ సిగ్నల్ పడగానే హడావుడిగా రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి వాహనాలు. హైటెక్ స్పీడ్...యుద్ధ ప్రాతిపదిక అంటే నిజంగా ఇక్కడే చూడవచ్చు.

వాహనాలు ఆగిన సమయంలో నాలుగు బేరింగు చక్రాలు కలిగిన పీటం మీద, రెండు కాళ్లులేని, చేతులే కాళ్లుగా బండి తోసుకుంటూ హైటెక్ స్పీడ్‌లో ఓ వ్యక్తి అడుక్కోవడం చూస్తుంటే ఆ వ్యక్తిని అభినందించాలనిపిస్తుంది. అన్నీ సరిగ్గా వున్నవాళ్లే రోడ్డు దాటాలంటే భయపడే ఆ సెంటర్లో ఆరంగేట్రం చేసే అతన్ని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆ సెంటర్‌లోని వాళ్లకేకాదు, రోజూ అటుగా వెళ్లే వాహనాలవారికీ సుపరిచితుడే ఆ వ్యక్తి. అతనే శ్రీమాన్ యాదగిరి.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని సత్యాగ్రహాల్లో పాల్గొని లాఠీదెబ్బలులాంటివి తిని, జైలులాంటి జీవితం అనుభవించి బ్రిటిష్ పాలకుల దుశ్చర్యలకు బలై రెండు కాళ్లూ పోగొట్టుకుని తనవారికి దూరమై దిక్కుతోచని స్థితిలో సదరు వ్యక్తి కలకత్తా నుంచి హైదరాబాద్ చేరి స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను జనానికి చెప్పుకుంటూ ఏకాకిగా బ్రతకడం కోసం ప్రదేశంతోపాటు పేరు మార్చుకుని జీవిస్తున్నాడు యాదగిరి.

ప్రభుత్వం గుర్తించకపోయినా ప్రజల్లో గుర్తించినవారు జాలిగా, దయతో ఇచ్చిన పైసలు పోగుచేసి దేశరక్షణకు త్యాగం చేస్తున్న వీరజవానులకు తన వంతు సాయం అందిస్తూ అదే తృప్తితో జీవితాన్ని స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఇలా గడిపేస్తున్నాడు యాదగిరి. జవసత్వాలు ఉడిగిపోయి ముసలితనం మీదపడ్డా చలించని గుండె ధైర్యం అతనిది. దేశాన్ని కాపాడుకుందాం, సమసమాజం స్థాపిద్దాం అనే బోర్డు బండికి కట్టుకుని జాతీయ జండా పెట్టుకుని అడుక్కుంటాడు. అతని దేశాభిమానానికి 'అతన్ని చూసి నేర్చుకోండి' అంటూ కామెంట్ చేస్తుంటారు ప్రక్కవారిని దారిపోయే జనం. దానికి లోలోపలే మురిసిపోతాడు యాదగిరి.

ప్రతిరోజూ శబ్దకాలుష్యం పెరిగే సమయానికి లేచే అలవాటు అతనిది. కానీ ఈ రోజెందుకో... రోజూ పడుకునే పెట్రోలు బంకు మూల గోనెసంచులు కప్పుకుని అలాగే పడుకోనున్నాడు యాదగిరి.

''యాదన్నా! యాదన్నా'' పల్లీలమ్ముకునే పోలమ్మక్క గల్లీ గల్లీలు తిరిగి సెంటర్‌లో యాదగిరి లేకపోతే వచ్చి లేపింది. తృళ్లిపడి లేచాడు యాదగిరి. గోనెసంచి కంతలోంచి చూశాడు కళ్లు కొద్దిగా తెరచి మత్తుగా.

''ఓ యాదన్నా...! లెయ్ గంట 12 దాటింది. ఏందియ్యాల మొద్దు నిద్ర'' అంది రాగాలు తీస్తూ పోలమ్మక్క.

బంధువు కాకపోయినా, సెంటర్లో ఫ్రెండు...ఒక్కరోజు చూడకపోయినా ఏదో వెలితిగా వుంటుంది ఆమెకి. అందుకే వచ్చి పనిమాలా లేపింది యాదగిరిని పోలమ్మ.

''పాణం బాగోలేదా ఏందీ? రాతిరేమన్నా గలాటా జరిగిందా?'' అనుమానంగా ఆదుర్దాగా అడిగింది పోలమ్మ.

''లే... పోలమ్మ! సినిమాకి పోయినా. టైటానిక్ అని ఇంగ్లీసు...పెద్దాట. అందుకే నిద్రలేదు. మంచి సినిమా చూడక్కా'' సిఫారసు చేశాడు...సర్టిఫికెటిచ్చాడు యాదగిరి.

''లే...ఇయ్యాల బందంట. సినిమాలున్నయ్యో లేదో'' అంది అనుమానిస్తూ.

''బందా? నిన్ననేగదే బందు. మొన్నమో ఏదో నాడు... చచ్చినట్టే వుంది'' ఒక్కసారి లేచి ఒళ్లు విదిల్చాడు యాదగిరి.

''అయినా ఎందుకేంటి బందు?'' అడిగాడు మళ్లీ ఆవులిస్తూ.

''ఆ...ఎవడో రౌడీ చచ్చినోడు చచ్చాడంట. అదే చంపారంట. అందుకని బందంట'' చెప్పింది బాధగా, చిన్నగా, రహస్యంగా సాగదీస్తూ పోలమ్మ.

''రెండురోజులకోసారి బందంటే మనబోటోల్లం బ్రతికేదెట్టా. మన బ్రతుకులు తెల్లారేదెట్టా. ఈ దేశం బాగుపడేదెప్పుడో. గాంధీజీ కలలుగన్న రామరాజ్యం వచ్చేదెప్పుడో'' అంటూ చెప్పుకుపోతున్నాడు యాదగిరి.

ఒకప్రక్క జేజే అంటూనే అవతలివాళ్లు వద్దన్నా యాదగిరి ఆపకుండా దేశం గూర్చి దంచేస్తాడనే భయంతో ''నువ్వెంత బాధపడితే ఏం ప్రయోజనమన్నా. బోణీకాలే పొద్దుగాట్నుంచి'' అంటూ చెప్పి తప్పుకుంది పోలమ్మ అక్కడినుంచి.

నడుముకి కట్టుకున్న గుడ్డసంచి తీసి చూసాడు యాదగిరి. అందులో 90 పైసలు మాత్రమే ఉన్నాయి. టీ తాగాలంటే కనీసం ఓ నాలుగు రూపాయలన్నా సంపాదించాలి. ఎండ ఓ ప్రక్కన మండిపోతున్నా, కడుపులో ఆకలికి తప్పనిసరై జగన్నాధ రథ చక్రాలకు పని కల్పించాడు. సెంటర్లో కాస్సేపు ఆరంగేట్రం చేశాడు. లాభం లేదు. ఎండ దెబ్బకి చమటలు కారిపోతున్నాయి.

లాభం లేదనుకుని ''ఓ రెండు రూపాయలుంటే ఇయ్యన్నా. చాయ్ తాగలే పొదుగాల్నుంచి'' అంటూ దీనాతిదీనంగా అడిగాడు బీటుకానిస్టేబుల్ని. అప్పుడప్పుడు అతని దగ్గర తీసుకుని సాయంత్రం ఇవ్వడం అలవాటు. అందుకే తప్పనిసరై అడిగాడు.

''నేనూ ఛాయ్ తాగలే. నువ్వే వుంటే ఇవ్వరా ముసలోడా'' అన్నాడు కిందకి చూస్తూ.

''చూడూ! నేనూ ఇప్పుడే వచ్చానన్నా. బందకదా. ఇంకా బోణీకాలే. కాస్సేపు ఆగు చూద్దాం'' అన్నాడు కానిస్టేబుల్ ఆశ కలిగిస్తూ యాదగిరితో.

అంతలో ఎక్కడినుంచో రెండు లారీలు...వాటినిండా ఏదో సామాను, కూలీలు వచ్చి ఆగాయి పెట్రోలు బంకు పక్కన. లారీలోంచి ఇద్దరు ఆఫీసర్లు దిగి ముఠావాళ్లకి ప్లాన్ చెబుతున్నారు. చూస్తుండగానే హైటెక్ స్పీడ్‌తో లారీ

**నడుముకి కట్టుకున్న గుడ్డసంచి తీసి చూసాడు యాదగిరి. అందులో 90 పైసలు మాత్రమే ఉన్నాయి. టీ తాగాలంటే కనీసం ఓ నాలుగు రూపాయలన్నా సంపాదించాలి. ఎండ ఓ ప్రక్కన మండిపోతున్నా, కడుపులో ఆకలికి తప్పనిసరై జగన్నాధ రథ చక్రాలకు పని కల్పించాడు. సెంటర్లో కాస్సేపు ఆరంగేట్రం చేశాడు. లాభంలేదు. ఎండ దెబ్బకి చమటలు కారిపోతున్నాయి.**

లోంచి ఏవో బోర్డులు దింపుతున్నారు. కూలీలు అంతా హడావుడిగా తయారైంది అక్కడి వాతావరణం.

''ఏందన్నా? ఎందా హడావుడి?'' అడిగాడు యాదగిరి అయోమయంగా కానిస్టేబుల్ని అటువైపు చూస్తూ.

''లే... బోర్డు పెడుతున్నారు. స్వర్ణోత్సవాల బోర్డు. 50 సంవత్సరాలు దాటిందికదా మనకు స్వాతంత్ర్యం వచ్చి. దేశం ఎంత ప్రగతి సాధించిందో, సాధించబోతోందో జనానికి తెలియజెప్పడానికి ప్రభుత్వం వాళ్లు ఓ పెద్ద బోర్డు పెడుతున్నారు''
చెప్పాడు క్లుప్తంగా.

''ఎంత ప్రగతి సాధించిందన్నా?'' అడిగాడు యాదగిరి. ముఖంలో ఏదో తెలియని బాధ కన్పించింది.

''అయినా నీకెందుకంట? అవతలికిపోక'' విసుక్కున్నాడు కానిస్టేబుల్.

నీకెందుకు? అంటే చచ్చేంత కోపం యాదగిరికి. అందుకే విషయం ఏమిటో పూర్తిగా తెలుసుకోవాలని అటుగా బయలుదేరాడు యాదగిరి.

ఓ పాతికమందిదాకా ఉన్నారు కూలీలు. లారీలో బోర్డులు. ఇనుప రాడ్లు దింపేవారు దింపుతున్నారు. గుంటలు తవ్వేవాళ్లు తవ్వుతున్నారు. బోల్టులు బిగించేవాళ్లు బిగిస్తున్నారు. ఐరన్ రాడ్లు, పైపులు నిలబెట్టేవారు నిలబెడుతున్నారు. సిమెంటు కలిపేవాళ్లు, కొలతలు తీసేవాళ్లు...ఎవరి పనుల్లో వాళ్లు లీనమైపోయారు చకచకా హైటెక్ స్పీడుతో.

''కష్టజీవులయ్యా. మీరు లేకపోతే ఈ దేశం ఒక్క నిమషం గడవదు'' ఓ కూలీని పొగిడాడు యాదగిరి దగ్గరకుపోయి.

''కంట్రాక్టు బాబు. యుద్ధ ప్రాతిపదికన స్పీడుగా అయిపోవాలి. ఓ గంటలో నిలబెట్టాలి బోర్డు. పై అధికార్ల ఆర్డరు. రాజు తలచుకుంటే'' చెప్పుకుపోతున్నాడు పని చేస్తూనే కార్మికుడు పనిలో లీనమైపోతూనే.

అంతలో...

సినిమాహాల్లో జేబులుకొట్టే రాంబాబు చెత్తకుండీలో దొరికి అనాథగా పెరిగి పెద్దవాడైన చాక్లూరాం, మసాల బండి నడుపుకునే మస్తాన్, ఆకుకూరలమ్మే కుళ్ళాయప్ప, ఫ్లాస్కు టీ అమ్ముకునే మురుగన్‌సామి, ఇరానీ హోటల్లో కప్పులు కడిగే రామశాస్త్రి, దొంగ టిక్కెట్లు అమ్మే జానీ, ఆటో తోలుకుని బతికే ఇస్మాయేలు కరీమ్, సెటప్‌లు కూర్చే జగ్గు, పెట్రోలు బంకులో పనిచేసే రాజు, చెత్తకాగితాలు ఏరుకుని అమ్ముకునే కొండలు, లోన బైట ఆపివేసే సింగూనామ్, బఠానీలు పల్లీలు అమ్ముకునే లచ్చిమి,




అంతా అక్కడికీ చేరారు ఆదుర్దాగా, ఆశ్చర్యంగా.

''విషయం ఏమిటి?'' అడిగాడు పెద్దవాడిగా గుర్తింపునిస్తూ యాదగిరిని.

అందర్నీ ఒక్కసారిగా చూసేసరికి యాదగిరి నోటి నిండా పని దొరికింది. ఆనందంతో పొంగిపోయాడు. ఆ అనందంలో ఛాయ్ సంగతి ఆకలి సంగతి మర్చిపోయాడు కూడా.

''పండగరా...పండగ. యాభై ఏళ్ల స్వర్ణోత్సవాల పండగంట. దేశం ఎంత ముందుకు పోయింది. ఎంత ప్రగతి సాధించింది. సాధిస్తుంది తెలిపే బోర్డు పెడుతున్నారు. అందరు చూసి చదువుకుని ఆనందిస్తారు కూడా. అందుకని'' చెప్పుకుపోతున్నాడు ఓ నాయకుడిలా ఫోజు పెట్టి యాదగిరి.

''నాబోటి చదువురానివాళ్లు?'' మధ్యలో చెత్తకాగితాలవాడు ప్రశ్న.

ఏం చెప్పాలో అర్థంకాక ఆగిపోయాడు యాదగిరి.

ఒక్కసారిగా అందరూ గొల్లున నవ్వి వెళ్లిపోయారు అక్కడి నుంచి వచ్చినంత స్పీడుగా.

''హరహరా'' అంటూ బోర్డుకి తాళ్లు కట్టి పైకి లాగుతున్నారు.

ప్లాన్ చెబుతున్న ఆఫీసర్ల సలహా మేరకు శక్తినంతా కూడగట్టుకుని కూలీలు ''కట్టమైసమ్మా... పోచమ్మ తల్లీ'' అంటూ కొంచెం కొంచెం బోర్డు పైకి లాగుతున్నారు.

ఒక్కసారిగా వచ్చిందో హైటెక్ స్పీడుతో సుడిగాలి. ప్రకృతి వైపరీత్యాలకు ఎవరేం చెప్పగలరు.

కూలీలు తాళ్లు గట్టిగా లాగుతున్నారు. గాలి వేగం పెరగసాగింది. అంతే 'ధడేల్'మనే శబ్దం. 'ఫెడేల్, ఫెళఫెళ' అంటూ కూకటి వేళ్లతో పెళ్లగిల్లిన చెట్టులా కూలిపోయింది బోర్డు. రోడ్డుపై పడింది పక్కకి ఒరిగిపోయి. మురావాళ్ల చేతుల్లో తాళ్లు పట్టుతప్పాయి. బరువు ఆపలేకపోయారు. బోర్డు పడిపోయింది. దారినిపోయే జనం ఎక్కడివాళ్లక్కడే నిలబడిపోయారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. కూలీలంతా చేరి బోర్డు లేపారు. ప్రక్కకి జరిపారు బోర్డుని ఆదుర్దగా, ఆత్రంగా. బోర్డు కింద చెక్రాల బండిపై యాదగిరి మాంసపుముద్ద అయ్యాడు. అప్పచ్చిలా అయిపోయింది యాదగిరి శరీరం. రక్తపుమడుగుల్లో తేలింది. పాపం స్వర్ణోత్సవాలకు జేజేలు పలుకుతూ అనంతవాయువుల్లో కలసిపోయింది ప్రాణం.

బోర్డుపై అంటించిన అక్షరాలు ఓ స్కూటర్ వెనకాల కూర్చున్న ఇంగ్లీషు మీడియం చదువుతున్న తెలుగు కుర్రాడు రక్తంతో చెల్లాచెదురుగా ఆ అక్షరాలు 'దే..వ..త..రం..మా..' అనుకుంటూ వచ్చీరాని తెలుగులో. ప్రగతి స్పీడేమోగానీ కార్పొరేషన్ వ్యాన్‌లో యాదగిరి శవం మాత్రం అక్కడినుంచి స్పీడుగా, హైటెక్ స్పీడుతో బయలుదేరింది. అదీ అప్పుడే వచ్చిన పోలీసు వారి ఆధ్వర్యంలో స్పీడుగా, హైస్పీడుగా, హైటెక్స్పీడుగా! ★